'రౌడీషీట్ల' రాజకీయం!

పుంగనూరులో విపక్షాలకు పెరిగిపోతున్న వేధింపులు

టీడీపీ ఇన్‌ఛార్జి చల్లాబాబు సహా 41మంది శ్రేణులపై రౌడీషీట్లు


మరో 80మంది కార్యకర్తలపైనా తెరిచేందుకు రంగం సిద్ధం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ విపక్షాలకు వేధింపులు పెరిగిపోతున్నాయి. తాజాగా పోలీసులను అడ్డు పెట్టుకుని రౌడీషీట్ల రాజకీయానికి వైసీపీ తెరలేపింది.టీడీపీలో క్రియాశీలకంగా ఉండే వారిపై రౌడీషీట్లు తెరవడానికి రంగం సిద్ధమైంది.

పుంగనూరు, ఫిబ్రవరి 11: గత ఏడాది డిసెంబరు నాల్గవ తేదీన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటనకు పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి అంగళ్లు, మదనపల్లె, పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు వరకు వెళ్లాల్సి ఉండగా అంగళ్లులో గొడవ జరగడంతో పుంగనూరులో ఉద్రిక్తత నెలకొంది. ప్రాజెక్టులను అడ్డుకుని అభివృద్ధికి సహకరించని చంద్రబాబుకు పుంగనూరులో అడుగుపెట్టే అర్హత లేదని అధికార వైసీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసన ర్యాలీ, మీటింగ్ ఏర్పాటు చేశారు. చంద్రబాబు అంగళ్లులో ఉన్న సమయంలోనే పుంగనూరులో టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పుంగనూరుకు చంద్రబాబు వస్తే మీకొచ్చే ఇబ్బందేంటని పోలీసులను టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో లాఠీచార్జి చేయడంతో ఇరువర్గాల మధ్య రాళ్లు రువ్వుకోవడం, బాష్పవాయువు ప్రయోగంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాళ్లు, కర్రలు, లాఠీల దాడులతో ఒక వైపు పోలీసులు, మరో వైపు టీడీపీ శ్రేణులు తీవ్ర గాయాలకు గురయ్యారు. దీంతో పోలీసులు ఏడుగురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఒకే సంఘటనకు సంబంధించి టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబును ఏ1గా పొందుపరుస్తూ దాదాపు 500 మంది పార్టీ శ్రేణులపై పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో చాలామంది సంఘటనా స్థలంలో లేకపోయినా టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారన్న కారణంతోనే కేసులు పెట్టినట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

భారీగా రౌడీషీట్లు

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబుపై 755 నెంబరుతో రౌడీషీట్‌ను పోలీసులు తెరిచారు. ఇటీవల పలమనేరు డీఎస్పీ సుధాకర రెడ్డి బదిలీపై వెళుతూ జనవరిలో 12మందిపై, కొద్ది రోజుల క్రితం 29 మందిపై రౌడీషీట్లు తెరుస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. తాజాగా నియోజకవర్గంలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన టీడీపీ నాయకులపై రౌడీషీట్లు తెరిచారు. వై.అష్రఫ్ అలీ, దొరబాబు, మహేశ్వర్, చల్లా రామచంద్రారెడ్డి, రాజేష్‌నాయుడు, దేవేంద్ర, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, మహ్మమద్ అక్రం, ఓబులేశ్వర్‌రెడ్డి, సహదేవుడు, రాజేంద్ర, గురుమూర్తి, నాగార్జునసాయుడు, ఉయ్యాల జ్యోతినాథ్, ఉళ్లంగినేని వెంకటరమణ, మనోజ్‌కుమార్, నాగరాజు, హయత్‌హుస్సేన్, హేమప్రకాష్‌రెడ్డి, రమేష్‌బాబు, క్రిష్ణమూర్తినాయుడు, మునిక్రిష్ణమనాయుడు, పురుషోత్తంనాయుడు, సరేష్, చెంగల్‌రెడ్డి, సుందర, శ్రీహరి, అహ్మద్‌ఖాన్‌లపై రౌడీషీట్లు తెరుస్తూ వారికి నెంబర్లు కేటాయించారు. వీరితో కలిపి మూడు కేసులకు సంబంధించి 120 మందికి పైగా టీడీపీ క్రియాశీలక కార్యకర్తలపై రౌడీషీట్లు తెరవడానికి డీఎస్పీకి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.



వరుస అరెస్టులు

ఇప్పటికే టీడీపీ వారిని చాలామందిని అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలు, మదనపల్లె, చిత్తూరు జైళ్లకు తరలించారు. ఒక కేసులో బెయిల్‌పై రాగానే మరో కేసు ఉందని మళ్లీ అరెస్టు చేయడం మళ్లీ బెయిల్‌పై రాగానే మూడో సారి కూడా అరెస్టు చేశారు.

దళితులు, వైసీపీ శ్రేణులు మీపై నమ్మకం కోల్పోయారు

● ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త నేతను కోరుకుంటున్నారు ● డిప్యూటీ సీఎంపై మేనల్లుడు రమేష్ విసుర్లు



మీడియాతో మాట్లాడుతున్న రమేష్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 11: 'జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని దళితులు, వైసీపీ శ్రేణులు.. నారాయణస్వామిపై నమ్మకం కోల్పోయారు. అందుకే ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త నాయకత్వాన్ని కోరుకుంటున్నారు' అని డిప్యూటీ సీఎం మేనల్లుడు రమేష్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ రాజా చెక్‌పోస్టుకు సమీపంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'పదేళ్ల కిందట వైసీపీ అధినేత జగన్ సత్యవేడులో ఎమ్మెల్యేగా పోటీచేయమంటే అక్కడి ప్రజలు మిమ్మల్ని రెండోసారి ఆదరించరని అర్థమవడంతో వైఎస్‌ని మాజీ మంత్రి కుతూహలమ్మ చిట్టారన్న సాకుచూపించి జీడీనెల్లూరులో పోటీ చేసింది వాస్తవం కాదా? రెండుసార్లు ఎమ్మెల్యే అయి, డిప్యూటీ సీఎం హోదా వచ్చాకైనా స్థానిక దళితులకు, వైసీపీ కార్యకర్తలు, నేతలకు చెప్పింది ఒకటైనా చేశారా..? కనీసం మీకోసం ఖర్చుచేసి, అప్పుల పాలైన వారినైనా ఆదుకున్నారా? దళితజాతిని అడుగడుగునా తొక్కుకుంటూ వెళుతుంటే.. మిమ్మల్నే ఆరాధించాలని రూలుందా..? అందుకే కొత్త వారిని కోరుకుంటున్నారు. నిజంగా దళితజాతిపై ప్రేమ ఉంటే ఇంకో నాయకుడిని ఎందుకు తయారు చేయలేదు? మీ రాజకీయం కోసం ఉమ్మడి కుటుంబాన్ని మూడుముక్కలు చేసి వాడుకున్నారు. భార్య కూతురు చెప్పిందని దిగజారుడు రాజకీయాలు చేయొద్దు. ఆఖరికి కార్వేటినగరంలో జడ్పీటీసీ పదవికైనా దళితజాతిలో మరొకరికి ఇవ్వకుండా భార్యకు ఇప్పించుకున్నది నిజమా.. కాదా?' అని రమేష్ నిలదీశారు. ఈ సమావేశంలో పాదిరికుప్పానికి చెందిన శంకర్, గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

రాజకీయ వారసుడిగా నా పేరు చెప్పింది నిజం కాదా?

'నాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భవిష్యత్తులో నా రాజకీయ వారసుడిగా రమేష్‌నే ఎమ్మెల్యే చేస్తానని మా తల్లిదండ్రులకు చెప్పింది వాస్తవం కాదా.. మీ గుండెలపై చేయి వేసుకుని నిజం చెప్పండి' అని డిప్యూటీ సీఎంని ఆయన మేనల్లుడు డిమాండ్ చేశారు.

'ఖజానా'కు కళ్లెం

ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాల అద్దె బిల్లులు పాస్

మిగిలిన ఖాతాలను ఫ్రీజింగ్‌లో ఉంచిన ప్రభుత్వం



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: జిల్లా ఖజానా, ఉపఖజానా కార్యాలయాల్లో బిల్లుల స్వీకరణ, చెల్లింపులకు బ్రేక్ పడింది. కేవలం ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాల అద్దె బిల్లులను మాత్రమే పాస్ చేస్తున్నారు. మిగిలిన ఖాతాలన్నింటినీ ప్రభుత్వం ఈనెల వదో తేదీ నుంచి ఫ్రీజింగ్‌లో ఉంచింది. సీఎఫ్ఎంఎస్‌లో పాత, కొత్త బిల్లులు రూ.వంద కోట్ల మేర చెల్లింపులకు కళ్లెం పడినట్లు సమాచారం. గతంలో మార్చి నెలలో బిల్లుల చెల్లింపులు నిలిపేసేవారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాబడి లేకపోవడం, ఆర్థికలోటు కారణంగా ఫిబ్రవరి నుంచే బిల్లుల చెల్లింపులకు బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ బడ్జెట్ లిస్ట్ ఆన్‌లైన్‌లో కనిపించక పోవడంతో చెల్లింపులు ఆగాయని ఉద్యోగులు అంటున్నారు. మరోవైపు ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు రెండునెలల క్రితమే నిలిచిపోయాయి. ఇవన్నీ ఇలా ఉంటే.. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఉండేది అరకొర నిధులు మాత్రమే. వీటిని ఆపేయడం ఇబ్బందిగా మారనుంది. ప్రధానంగా విద్యుత్, టెలిఫోన్, నెట్, స్టేషనరీ వంటి కార్యాలయ నిర్వహణ బిల్లులూ ఆగిపోయాయి. కొన్ని చోట్ల ఉద్యోగులు తమ సొంత డబ్బులు వేసుకుని నెట్ ఉపయోగించుకోవాల్సి వస్తోంది.

కరెంట్ కట్ చేస్తామంటున్న విద్యుత్ అధికారులు

ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల బకాయిలు ఇప్పటికే రూ.లక్షల్లో ఉన్నాయి. మార్చినెలలోగా బకాయిలు పూర్తిగా వసూలు చేయాలని పైనుంచి ఆదేశాలు వస్తుండటంతో కలెక్టరేట్‌తో సహా పలు ప్రభుత్వ కార్యాలయాలకు కరెంట్ కట్ చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

ఏనుగుల గుంపు స్వైరవిహారం





ధ్వంసమైన మామిడి, టమోటా తోటలు, ఇల్లు



సోమల, ఫిబ్రవరి 11: సోమల మండలంలోని పేటూరు గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన చిట్టిబాబు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రఘు, టమోటా తోటల్లో కాయలను తిన్నంతా తిని ఊతంగా నాటిన కర్రలను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. ఆ సమీపంలోనే ఇళ్లపల్లెకు చెందిన ఊసన్న మరో ఇద్దరి ఇళ్లనూ ధ్వంసం చేశాయి. ఏనుగుల భీకర అరుపులతో ఇళ్ల నుంచి జనం పరుగులు పెట్టారు. మేకల మందలను తీసుకుని తలో దిక్కుకు పారిపోయారు. పది ఏనుగుల గుంపు సంచారంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. వారం రోజులుగా సోమల, నెల్లిమంద, తమ్మినాయనపల్లె, ఇరికిపెంట పంచాయతీల్లోని పొలాల్లో ఏనుగుల సంచారంతో టమోటా తోటల్లో కాయలు కోతలు జరగడం లేదు. కొందరు రైతులు జట్లుగా ఏర్పడి టపాసులు పేల్చుకుంటూ, డప్పుల శబ్దం చేస్తున్నారు. మరికొందరు పొలాల వద్దనే మంటలు వేసుకుని జాగరణ చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నగరికి నలుగురు మంత్రులట!



● జబర్దస్తీగా దోచేస్తున్నారట ● రోజాపై వైఎస్ షర్మిల ఆరోపణల వర్షం



నగరి ర్యాలీలో షర్మిల అభివాదం

నగరి, ఫిబ్రవరి 11: 'నగరి నియోజకవర్గంలో రోజా ఒక మంత్రి, ఆమె భర్త మరో మంత్రి, అన్నదమ్ములిద్దరు కూడా మంత్రులు. నలుగురు మంత్రులూ జబర్దస్తీగా దోచేస్తున్నారు' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. నగరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన సభలో ఆమె సీఎం జగన్ పాలనా వైఫల్యాలతోపాటు మంత్రి రోజాపై విమర్శల వర్షం కురిపించారు. నగరి నియోజకవర్గంలో రాత్రికి రాత్రే కొండలు మాయమవుతున్నాయన్నారు. గ్రావెల్, మట్టి, ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తూ రూ.వందల కోట్లు జబర్దస్తీగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆఖరికి చిన్నచిన్న ఉద్యోగాల్లో సిఫార్సులకు కూడా కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. నిరుపేదలకు కట్టించే పక్కా గృహాల్లో సైతం రూ.వందల కోట్లు దోచుకుంటున్నారన్నారు. ఎవరైనా వెంచర్లు వేస్తే వారికి ప్లాట్లన్నా ఇవ్వాలట, కప్పం అన్నా చెల్లించాలట. వారి కన్ను పడితే ఇక అంతే ఆ ప్లాట్ల గతి అని జనమంటున్నారన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల నుంచి నెలవారీ ముడుపులు తీసుకుంటున్నారంటూ ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన గాలేరు-నగరి ప్రాజెక్టు నేటికీ పూర్తికాలేదంటే జగన్‌రెడ్డికి రైతుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తోందన్నారు. చెరకు పరిశ్రమలను తెరిపించి రైతులను ఆదుకుంటామని నాడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. మరమగ్గ కార్మికులకు ఒకనాడు 1000 రూపాయలు వచ్చే విద్యుత్ చార్జీలు ఇప్పుడు రూ.5000కు పెరిగిపోవడంతో బతకాలా? ఆత్మహత్యలు చేసుకోవాలా? అన్న స్థితిలో వున్నారన్నారు. నగరిలో కాలుష్య నివారణకు రంగునీటి శుద్ధికోసం పెట్టిన ఈటీపీ ప్లాంట్ నడపడానికి అవసరమైన ఖర్చును కూడా భరించలేని స్థితిలో జగన్ ప్రభుత్వం వుందన్నారు. విజయా డెయిరీని తెరిపిస్తామని నాడు చెప్పి.. నేడు అమూల్ డెయిరీకి అప్పనంగా అంటగట్టారన్నారు. కాగా నగరిలో షర్మిల పర్యటనకు మంచి స్పందన వచ్చింది. సాయంత్రం 5.30 గంటలకు నగరి పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలసి షర్మిల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాక గంటన్నరకుపైగా ప్రసంగించారు. సీఎం జగన్‌తో పాటు మంత్రి రోజాపై షర్మిల విమర్శలకు కరతాళ ధ్వనులతో సభ మారుమోగింది.

బోడికొండలో ఆగని ఆక్రమణలు

● ఎన్నికల పనుల్లో రెవెన్యూ అధికారులు

● పనికానిచ్చేస్తున్న అధికార పార్టీ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 11: చిత్తూరు నగర శివార్లలోని బోడికొండలో అధికార పార్టీ నేతల ఆక్రమణలు ఆగడం లేదు. తాజాగా స్థానిక రామ్‌నగర్‌కాలనీకి చెందిన అధికార పార్టీ కార్పొరేటర్ ఒకరు తేనెబండ రెవెన్యూ పరిధిలోని 282-1 సర్వే నెంబరులో వారం రోజులుగా ఐదారు ప్లాట్లను చదును చేస్తున్నారు. ఒక్కో ప్లాటు రూ.3-రూ.4 లక్షల వరకు అమ్ముకుంటున్నారని ప్రచారంలో ఉంది. ఎన్నికల పనుల్లో రెవెన్యూ అధికారులు ఉండటంతో తన పని కానిచ్చేస్తున్నారన్న విమర్శలున్నాయి. సచివాలయ ఉద్యోగులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి ఈ ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతున్నారు.



బోడికొండను చదును చేస్తున్న యంత్రాలు

ఎన్నికలపై అధికారులకు నేటినుంచి శిక్షణ తరగతులు

తిరుపతి కేంద్రంగా నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై తిరుపతిలో మూడు విడతల్లో అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు, 19 నుంచి 23వ తేదీ వరకు, 26 నుంచి మార్చి ఒకటో వరకు శిక్షణ తరగతులు జరుగుతాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ క్యాంపస్‌లోని అడ్మిన్ బిల్డింగ్, హ్యూమానిటీస్ సెమినార్ హాల్, సావేరి అతిథిగృహ సెమినార్ హాల్‌ను కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఈ తరగతులకు ఇతర రాష్ట్రాల ఎన్నికల అధికారులు రిసోర్స్ పర్సన్లుగా వస్తారు. తొలి విడతలో చిత్తూరు జిల్లా నుంచి జిల్లా రెవెన్యూ అధికారి, ఐవోసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, చిత్తూరు ఆర్డీవో, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హాజరవుతారు. రెండో విడత తరగతులకు జేసీ, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు, చిత్తూరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమిషనర్లు, పుంగనూరు, రొంపిచెర్ల, పులిచెర్ల, చౌడేపల్లె, నగరి, విజయపురం, నిండ్ర, పెనుమూరు, కార్వేటినగరం, గంగాధరనెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం, గుడిపాల, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె మండలాల తహసీల్దార్లు హాజరవుతారు. మూడో విడత తరగతులకు కుప్పం, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు, చిత్తూరు కేఆర్‌సీసీ స్పెషల్ తహసీల్దార్, సోమల, సదుం, వెదురుకుప్పం, చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాల తహసీల్దార్లు హాజరుకానున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'

చిత్తూరు, ఫిబ్రవరి 11: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ జాషువా

ఎన్నికల విధులకు సమాయత్తంకండి

● అలసత్వం చూపిస్తే చర్యలు: ఎస్పీ

చిత్తూరు, ఫిబ్రవరి 11: ఎన్నికల విధులకు సమాయత్తం కావాలని ఎస్పీ జాషువా ఆదేశించారు. ఆదివారం పోలీసు అతిథి గృహంలో జరిగిన అధికారుల పరిచయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పలమనేరు డీఎస్పీగా పనిచేసిన 12 ఏళ్ల తర్వాత ఇక్కడికి ఎస్పీగా రావడం ఆనందంగా ఉందన్నారు. బాధితులు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని కుటుంబీకుల వలె భావించి న్యాయం చేయాలన్నారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దులో జిల్లా ఉండటం వల్ల మద్యం, డబ్బు రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు ఆరీపుల్లా, సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: జగనన్న ఇండ్ల రిజిస్ట్రేషన్లు రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులైనా జరిగాయి. సబ్ రిజిస్ట్రార్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి అక్కడి సిబ్బందికి సందేహాలను నివృత్తి చేస్తూ, సహకారం అందించారు. ఈనెల 18వ తేదీ ఆదివారం కూడా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆ శాఖ కమిషనర్ రామకృష్ణ సబ్‌రిజిస్ట్రార్లను ఆదేశించారు.

బధిర మహిళపై అత్యాచారయత్నం

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 11: బధిర మహిళ(45)పై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌పురం మండలంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ కోళ్లఫారంలో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు బాలకార్మికులు ఇంటి వద్ద నిద్రిస్తున్న బధిర మహిళ నోరుమూసి అత్యాచారయత్నం చేయబోగా, ఆమె కుమారుడు కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికొచ్చారు. వీరిని చూసి నిందితులు పారిపోతుండగా ఓ బాలుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కార్వేటినగరం సీఐ సత్తిబాబు ఆదేశాలతో ఎస్ఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. కోళ్లఫారాల్లో పనిచేసే బాలకార్మికులు చాలామంది డ్రగ్స్‌కి అలవాటు పడి.. రాత్రి వేళల్లో ఇటువంటి పనులతోపాటు దొంగతనాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ ఫారాలపై దృష్టిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ధనంజయ మృతదేహం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. కాణిపాకం ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలం 35యర్లంపల్లె పంచాయతీ గుట్టకిందపల్లెకు చెందిన ధనంజయ(49) తన సొంత పనిపై ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తిరువణంపల్లె హైవేపైకి రాగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు చిన్నారులకు ఆర్థికసాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చిన్నారులకు నగదు అందజేస్తున్న పార్థసారథి నాయుడు

కల్లూరు, ఫిబ్రవరి 11: పులిచెర్ల మండలం మంగళంపేట పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన వంశీ, లక్ష్మీదేవి దంపతులు ఆరు నెలల వ్యవధిలోనే ఒకరి తర్వాత ఒకరు మృతి చెందారు. దాంతో వీరి పిల్లలు సౌమ్య(8), హేమలత (5), వివేక్ (2)ల భవిష్యత్తు అంధకారమైంది. ఈ విషాదంపై 'ఎంత కష్టమొచ్చింది!' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై చిత్తూరుకు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ పార్థసారథి నాయుడు స్పందించారు. ఆదివారం మంగళంపేటకు చేరుకుని సర్పంచ్ మధుతో కలిసి ముగ్గురు పిల్లలుంటున్న ఇంటికి వెళ్లి ఈ ముగ్గురికీ రూ.31,000వేలను అందజేశాడు. ఒక్కో చిన్నారి పేరుపై బ్యాంకులో రూ.10వేల చొప్పున డిపాజిట్ చేయాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 70,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,801 మంది తలనీలాలు సమర్పించారు.

వైభవంగా పురశైవారితోటోత్సవం




తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, రామానుజాచార్యుల శిష్యులలో ప్రముఖుడైన అనంతాళ్వారు 970వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వారు తోటలో (పురశైవారితోట) ఆదివారం టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతళ్వారు వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్ఠిగానం' నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ 102 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానంలో స్వామి పుష్పకైంకర్యాన్ని ప్రారంభించి, ఉద్ధరించిన శ్రీవైష్ణ భక్తాగ్రేసరుడు అనంతాళ్వార్ అని కొనియాడారు. అనంతాళ్వారు వంశీకులు కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం ముదావహమన్నారు. చిన్నజీయర్ మాట్లాడుతూ తిరుమలలో పుష్పాల తోటను ఏర్పరచి తన జీవితాన్ని భగవంతుడి పాదాల వద్ద పుష్పంగా సమర్పించుకున్నారని అనంతాళ్వార్ జీవిత వైశిష్ట్యం గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ పరిచారకుడి మృతి



నరసింహన్ (ఫైల్ ఫొటో)



ఘటనా ప్రాంతంలో యతీరాజ నరసింహన్ మృతదేహం

తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో శ్రీవారి ఆలయంలో పని చేసే పరిచారిక మృతి చెందాడు. ఆలయంలోని సజేరాలో పరిచారికగా పని చేసే యతీరాజ నరసింహన్(43) విధులను పూర్తి చేసుకుని ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంలో తిరుపతికి బయలుదేరాడు. 37వ మలుపు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. యతీరాజ నరసింహన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరుపతికి తరలించారు.

జే బ్రాండ్ మద్యం తెచ్చి..

ప్రజల ప్రాణాలతో సీఎం చెలగాటం

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి



టీడీపీలో చేరినవారితో అమరనాథరెడ్డి, థామస్

పెనుమూరు, ఫిబ్రవరి 11: మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చి.. జే బ్రాండ్ మద్యం తీసుకొచ్చి.. ప్రజల ప్రాణాలతో సీఎం జగన్ చెలగాటం ఆడుతున్నాడని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. ఈ మద్యాన్ని విస్తరింపచేస్తున్న మంత్రి ఇదే నియోజకవర్గంలో ఉన్నాడని ముందు నారాయణస్వామి, జగన్ తమ బ్రాండ్లను తాగితే అవి ఎలా ఉన్నాయో తెలుస్తుందన్నారు. ఆదివారం పెనుమూరు మండలం పులికల్లు పంచాయతీ గొడుగుమానుపల్లి గ్రామంలో వైసీపీ నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరిలో మహేందర్‌రెడ్డి, పులికల్లు వైసీపీ వార్డు మెంబరు భర్త గోపాలమందడి, సుధాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, దిలీప్, తదితరులు న్నారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కిన జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా నిత్యావసరాల ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు, పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలాగా బ్రోకర్‌ని కాదు

● నారాయణస్వామిపై విరుచుకుపడ్డ థామస్

'ఓ పక్క ఎర్రచందనం దొంగ, మరో పక్క ఇసుక దొంగను పెట్టుకుని వారి నుంచి కమీషన్లు తీసుకుంటూ.. నీలాగా బ్రోకర్ని నేను కాదు.. డాక్టరుగా ఎంతో మందికి సేవ చేస్తున్నా' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి థామస్ విరుచుకుపడ్డారు. గొడుగుమానుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేను చెన్నైకి అడుక్కుతినేదానికి పోయానని ఇష్టం వచ్చినట్లు వాగుతున్న నారాయణస్వామికి సవాల్ విసురుతున్నా.. రాజమన్నార్‌రెడ్డి, చెంగారెడ్డి దగ్గర అడుక్కుతిన్నది ఎవరు? నీదీ ఓ బతుకేనా? నువ్వు రాజకీయాలకు పనికిరాని చెత్తవి. రాబోవు ఎన్నికల్లో ప్రజలు నిన్ను చెత్త బుట్టలో వేస్తారు' అని థామస్ అన్నారు.

వరసిద్ధుడికి కానుకగా 14రకాల వెండి హారతులు



వెండి హారతులను అందిస్తున్న దాత - అన్నదానానికి విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం 14 రకాల వెండి హారతులను కానుకగా అందాయి. వీటిని బెంగళూరుకు చెందిన అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి అందజేశారు. వీరిని చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే పూతలపట్టు మండలం గొడుగుచింతకు చెందిన శివప్రసాద్‌రెడ్డి గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,000 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విద్యేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు నాగ ప్రతిష్ఠ: వరసిద్ధుడి ఆలయంలో సోమవారం నాగ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. వేకువ జామున నాలుగు నుంచి ఐదు గంటల మధ్య పూర్వాబాద్ర నక్షత్రయుక్త శుభ ధనుర్లగ్నంలో ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. ఉభయదారులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్వీయూలో రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయం



పనులను ప్రారంభిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11: ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలో రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన శంకుస్థాపన ఆదివారం నిర్వహించారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఈ నిధులను సమకూర్చిందన్నారు. 500 మంది విద్యార్థులకు వసతి సామర్థ్యంతో ఈ సముదాయాన్ని నిర్మిస్తామని తెలిపారు. మాజీ వీసీ రాజారెడ్డి పాల్గొన్నారు.

సెమినార్ హాల్ ప్రారంభం

ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.10 లక్షలతో ఆధునీకరించిన సెమినార్ హాల్‌ను వీసీ ఆదివారం ప్రారంభించారు. 200 మంది సామర్థ్యంతో ఈ హాల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు.

ఒకే రోజు 89 మందికి కుక్కకాటు

చిత్తూరులో వీధికుక్కల స్వైర విహారం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11: చిత్తూరులో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆదివారం ఒక్క రోజే నగరంలోని పలు ప్రాంతాల్లో 89 మందిని కరిచాయి. జెండామాను వీధి, తోటపాళ్యం, సంతపేట, ఇందిరానగర్, కోర్టు జంక్షన్, ఎంఎస్ఆర్ సర్కిల్, కట్టమంచి, బజారు వీధుల్లోకొచ్చిన వాహనదారులతోపాటు స్థానికులు బాధితులుగా ఉన్నారు. వీరిలో 60 మందిపై ఒకే కుక్క దాడి చేయడం గమనార్హం. బాధితులంతా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిల్లో చికిత్స తీసుకున్నారు.

కార్పొరేషన్ లెక్కల ప్రకారమే 50 డివిజన్లలో 4వేలున్నాయి

50 డివిజన్లలో కార్పొరేషన్ లెక్కల ప్రకారమే నాలుగు వేల వీధికుక్కలు ఉన్నట్లు సమాచారం. అయితే స్వచ్ఛంద సంస్థల సర్వే ప్రకారం సుమారు 15వేల కంటే ఎక్కువ ఉన్నట్లు సమాచారం. ఒక్కో వీధిలోనే పది కుక్కల వరకు ఉంటున్నాయి. పది రోజుల కిందట కూడా 13వ డివిజన్ పరిధిలోని మాపాక్షికి చెందిన రామస్వామి యాదవ్ గొర్రెల షెడ్‌లో దూరి సుమారు పది గొర్రెలపై దాడి చేసి, చంపేశాయి. రెండ్రోజుల కిందట మిట్టూరులోని రెడ్‌క్రాస్ వీధిలోని కిడోస్ ప్రీప్రైమరీ స్కూల్ సమీపంలో ఇద్దరు వృద్ధులు వాకింగ్ కోసం మెసానికల్ మైదానానికి వెళ్తుండగా సుమారు 10 వీధి కుక్కలు దాడి చేశాయి. వారు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి రాళ్లు రువ్వడంతో చిన్న గాయాలతో బయట పడ్డారు. ఇలా శునకాల దాడిలో గాయపడటంతో రోజూ యూపీహెచ్‌సీల్లో, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయి.

సంఘటన జరిగినప్పుడే అధికారుల హడావుడి

ఏదైనా సంఘటన జరిగినప్పుడే అధికారులు హడావుడి చేస్తారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా నాలుగువేల కుక్కలుంటే 20 కూడా పట్టని ఓ వాహనాన్ని తీసుకొచ్చి ఫొటోలు ఫోజులిచ్చి వెళ్లిపోతారని వాపోతున్నారు. పైగా ఓ వీధిలో పట్టుకున్న కుక్కలను కూడా మరో వీధిలో విడిచి పెడుతున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ఆదివారం కూడా 60 మందిపై దాడి చేసిన కుక్కను పట్టుకున్నట్లు నగరపాలక సంస్థ తెలిపారు. అయితే బాధితులు మాత్రం అది తమను కరిచిన కుక్క కాదని చెబుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కమిషనర్ అరుణ



మిట్టూరులోని కిడోస్ స్కూల్ వద్ద ఉన్న కుక్కల గుంపు

సిరంజులు లేవట

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో సిరంజులు లేవని అక్కడి వైద్య సిబ్బంది చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక బయట మెడికల్ షాపులకు వెళ్లి సిరంజి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శించిన డీసీహెచ్‌ఎస్, కమిషనర్

వీధి కుక్కల దాడిలో గాయపడిన వారిని డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనరు అరుణ పరామర్శించారు. సిరంజులు, మందులు బయట రాస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తిరుపతి ఉప పోరుకు మరో నలుగురు బలి!

● ఈసీ ఆదేశాలతో ఇద్దరు సీఐలు సహా ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

● వీఆర్‌కు ఇద్దరు సీఐలు ● ఎన్నికల్లో అక్రమాలపై విచారణలో నిర్లక్ష్య పర్యవసానం

● అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటిపోకూడదని ఆదేశం



సీఐలు అబ్బన్న, దేవేంద్రకుమార్, శివప్రసాదరెడ్డి, శివప్రసాద్



ఎస్ఐ జయస్వాములు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11: తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి తాజాగా ముగ్గురు పోలీసు అధికారులు, ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్‌కాగా మరో ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ అయ్యారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సస్పెన్షన్‌తో మొదలైన కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తాజాగా మరో నలుగురి సస్పెన్షన్‌కు కారణమయ్యాయి.2021వ సంవత్సరంలో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఇతర ప్రాంతాల ఓటర్లను బస్సుల్లో తరలించి మరీ పోలింగ్ చేయించారు.వారికోసం ఏకంగా 34 వేల ఓటరు ఐడీ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయించారు.ఈ వ్యవహారాన్నంత టీసీ చూసీచూడనట్లు వ్యవహరించిన పోలీసులు ప్రతిపక్షాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు. పైగా కాలక్రమంలో ఆయా కేసులను కొట్టివేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ దర్యాప్తునకు ఆదేశించింది. పోలీసుల బాధ్యతా నిర్వహణపై దర్యాప్తుచేసిన ఉన్నతాధికారులు పలువురు పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఫిర్యాదులపై సక్రమంగా దర్యాప్తు చేయలేదని, ఆరోపణలు వచ్చినవారిని విచారించలేదని నిర్ధారించారు. అలాగే దొంగ ఓట్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా దొంగ ఓటర్లకు చెందిన ఎపిక్ కార్డులు, ఆధార్ కార్డులు ఇతర వివరాలను కూడా సేకరించి భద్రపరచాల్సి ఉండగా అవేమీ చేయలేదని కనుగొన్నారు. ఎటువంటి విచారణ లేకుండానే ఆయా కేసులను మూసివేసినట్లు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుకు బాధ్యులైన పోలీసు అధికారులు, సిబ్బందిపై అనంతపురం రేంజి డీఐజీ చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు.అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి ఎస్బీ సీఐగా పనిచేస్తున్న టీవీ శివప్రసాదరెడ్డి, ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఎ.జయస్వాములు, అప్పట్లో స్టేషన్ రైటర్‌గా పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి, వెస్ట్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శివప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. క్రైమ్ నంబర్ 176/2021 అండర్ సెక్షన్ 171 (ఎఫ్), 188 ఐపీసీ ప్రకారం అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి తప్పుడు సెక్షన్లతో కేసు నమోదు చేశారని, కేసు ఇన్వెస్టిగేషన్ అధికారిగా ద్వారకనాథరెడ్డి ఫిర్యాదుదారుని, సంబంధిత పోలింగ్ అధికారులను, బీఎల్‌ఓలను, నేరం జరిగిన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బందిని, పోలింగ్ బూత్‌లో ఉన్న ఇతర ఓటర్లను విచారించడంలో విఫలమయ్యాడని, అలాగే నిందితుల ఓటరు ఐడీ, ఎపిక్‌కార్డులు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని అందుకుగాను ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఎస్ఐ జయస్వాములు నేరం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సాక్షులను విచారించడంలో విఫలమయ్యారని, ఐపీసీ సెక్షన్ 171(ఎఫ్) ప్రకారం నేరాన్ని నిరూపించడానికి సాక్ష్యాలను సేకరించాల్సిందిపోయి ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా కేసుకు సంబంధించిన సెక్షన్లు ఐపీసీ 290కి మార్చుచేసేందుకుగాను న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారని ఉత్తర్వుల్లో వివరించారు. నకిలీ ఎపిక్ కార్డులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కేసులో సెక్షన్ మార్చి ఐపీసీ 290 ప్రకారం ఛార్జిషీట్ దాఖలు చేయడం దర్యాప్తు తీరు, నిబద్ధతను శంకించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇక సీఐ టీవీ శివప్రసాదరెడ్డి హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా స్టేషన్‌కు అధిపతి అయినందున కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తూ, కింది అధికారులకు మార్గనిర్దేశం చేయాలి. ఎస్‌హెచ్ఓ పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కేసు వాస్తవాలను పరిశీలించి, సేకరించిన సాక్ష్యాల ఆధారంగా దర్యాప్తును ధృవీకరించి, చట్టంలో తగిన సెక్షన్‌కింద ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారంలో అవసరమైన స్థాయిపర్యవేక్షణను అమలు చేయడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ టీవీ శివప్రసాద రెడ్డి విఫలమయ్యారని డీఐజీ ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే దొంగ ఓట్లపై నమోదైన ఓ కేసుకు సంబంధించి దర్యాప్తు సక్రమంగా నిర్వహించలేదనే కారణంతో అప్పట్లో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న సీఐ శివప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేశారు. వీరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు, అనుమతి లేకుండా వారు హెడ్‌క్వార్టర్స్ దాటి పోకూడదని డీఐజీ ఆదేశించారు.ఉప ఎన్నిక సమయంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసుకు సంబంధించి దర్యాప్తు చేయకుండానే కేసును మూసివేశారనే కారణంతో ఇద్దరు సీఐలను డీఐజీ వీఆర్‌కు ఆదేశించారు. అప్పట్లో అలిపిరి సీఐగా పనిచేసి ప్రస్తుతం రేణిగుంట రైల్వే సీఐగా పనిచేస్తున్న దేవేంద్రకుమార్‌ను, ప్రస్తుతం సీఐగా ఉన్న అబ్బన్నను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు.

టీడీపీతోనే బీసీలకు ప్రధాన గుర్తింపు

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథ రెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 11 : బీసీలకు ఆర్థికంగా, రాజకీయంగా చేయూతనిచ్చి ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అమర్ మాట్లాడుతూ టీడీపీ స్థాపించినప్పటి నుంచి బీసీలు అండగా ఉంటూ ఆదరిస్తూ వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే, బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సుబ్రమణ్యంగౌడు, సోమశేఖర్‌గౌడ్, ఆర్‌బీసీ కుట్టి, నాగభూషణం, స్వతంత్రబాబు, రెడ్డిశేఖర్, గంగప్ప, గోవిందస్వామి, మురళి, హరి, ఎల్.భాస్కర్, లోకేష్, బత్తిగౌడు, గణపతి, రామూర్తి, చంద్రప్ప, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేసేవారికే మా ఓట్లు : యూటీఎఫ్



ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

గంగవరం, ఫిబ్రవరి 11 : సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని ఎవరైతే అమలు చేస్తారో వారికే వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ తెల్చిచెప్పారు. ఆదివారం పలమనేరులోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద 'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్లను ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు మేము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగులందరినీ దగా చేసిందన్నారు. పాతపెన్షన్ అమలు చేయకపోగా జీపీఎస్ అనే దుర్మార్గపు పథకాన్ని తీసుకురావడం దారుణమన్నారు. పాతపెన్షన్ అమలు చేసేవరకు పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీ ప్రకాష్, కృష్ణమూర్తి, బాబు, ప్రసన్నకుమార్, బషీర్‌అహ్మద్, మంజుల, హరిగోవిందయ్య, వేమచంద్రారెడ్డి, భాస్కర్, సురేష్‌బాబు, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు



వాలీబాల్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ రెడ్డెప్ప, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి బహుమతులందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన మైసూరు జట్టుకు రూ.50వేలు నగదు, ద్వితీయ బహుమతి మైలారుదొడ్డి జట్టుకు రూ. 30వేలు, తృతీయ బహుమతి పొందిన సిద్దగట్ట జట్టుకు రూ.20వేలు, నాలుగో బహుమతి వికోట జట్టుకు రూ. 10వేలు నగదు బహుమతిని అందజేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, గంగవరం సీఐ కృష్ణమోహన్ కొంతసేపు వాలీబాల్ పోటీలను తిలకించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీహరిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, ఇర్షాద్, విశ్వమోహన్, రవికుమార్, ప్రసాద్, జిలాని, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకుండా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

ఒకే కాన్పులో మూడు లేగ దూడలు



చౌడేపల్లె, ఫిబ్రవరి 11 : ఒకే కాన్పులో 3 లేగ దూడలు పుట్టిన ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పరికిదొనకు చెందిన రత్నయ్య పాడి ఆవులు మేపుకొంటూ జీవనం సాగించేవాడు. శనివారం అర్ధరాత్రి ఆవుకు ప్రసవ సమయం రావటంతో గడ్డంవారిపల్లె పశువైద్యశిబిరంలో ఉన్న అటెండర్ రామకృష్ణకు సమాచారం అందించారు. ఆయన పరికదొనకు వెళ్లి ఆవుకు కాన్పు చేశాడు. ఈకాన్పులో 2 పెయ్యదూడలు, ఒక కోడె దూడకు ఆవు జన్మనిచ్చింది. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి.

ఏఎంసీ యార్డు పనులు వేగవంతం చేయండి

సోమల, ఫిబ్రవరి 11: సోమల వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న గోడౌన్ల నిర్మాణ పనులను ఆదివారం కడప రీజియన్ డీఈ హరినాథ్ రెడ్డి తనిఖీ చేశారు. టమోటా మండీలు, మామిడి గోడౌన్లు, షాపింగ్ గదుల నిర్మాణాలను పరిశీలించి కాంట్రాక్టరుకు సూచనలు చేశారు. పనులు వేగవంతం చేసి టమోటా సీజన్‌కు యార్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అరుణ, జడ్పీటీసీ కుసుమ, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ



గంగవరం, ఫిబ్రవరి 11: పలమనేరులోని ఎన్‌జీఓ హోమ్‌లో 2024వ సంవత్సరానికి సంబంధించి డైరీని పెన్షనర్ల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకాశా పోరాట జీవిత చరిత్రతోపాటు పెన్షనర్లకు ఉపయోగపడే అన్నిరకాల జీఓలు, పథకాలను డైరీలో ముద్రించామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గౌస్, ఆర్ముగంశెట్టి, త్రివిక్రమరావు, కృష్ణమూర్తి, వీపీ సుబ్రమణ్యం, గోవిందయ్య వీరభద్రగౌడు, శైల కుమార్‌ల తోపాటు పలువురు పాల్గొన్నారు.

నేడు రొంపిచెర్లలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల, ఫిబ్రవరి 11: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 12వ తేదీ సోమవారం ఉదయం రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో పర్యటిస్తారని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. మండలంలో నూతనంగా నిర్మించిన మోడల్ స్కూల్ వసతి భవన సముదాయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.



కల్లూరును కమ్మేసిన పొగమంచు

పులిచెర్ల మండలం కల్లూరు పరిసరాల్లో ఆదివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకు ఇదే పరిస్థితి. రైతులు, కూలీలు, వాకర్లు ఇబ్బందులు పడ్డారు. వాహన చోదకులు లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. - కల్లూరు



చంద్రబాబుతోనే గాండ్ల కులస్తులకు న్యాయం

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఫిబ్రవరి 11: గాండ్ల కులస్తులకు న్యాయం జరగాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ఆయనతోనే వారికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కమతమూరు దండుమారెమ్మ దేవస్థానం ఆవరణలో ఆదివారం మాజీ సర్పంచి వీజీప్రతాప్ పర్యవేక్షణలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అఖిల గాండ్ల తెలికుల కులస్తుల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ 1952-1978 మధ్య కాలంలో గాండ్ల కులానికి చెందిన డి.వెంకటేశం, రామబ్రహ్మం, వజ్రవేలుశెట్టిలు కుప్పం ఎమ్మెల్యేలుగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. గాండ్ల కులస్తులు ఎప్పటినుంచో టీడీపీకి మద్దతుదారులుగా ఉన్నారని చెప్పారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. టీడీపీ గాండ్ల సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు విశాలాక్షి మాట్లాడుతూ గాండ్ల సామాజిక వర్గం జగన్ పాలనలో ఎన్నో కష్టనష్టాలకు లోనైందన్నారు. గాండ్ల కులస్తులకు మళ్లీ మంచి రోజులు రావాలంటే చంద్రబాబు తిరిగి సీఎం కావడం ఒకటే మార్గమని స్పష్టం చేశారు. మాజీ సర్పంచి ప్రతాప్ మాట్లాడుతూ గాండ్ల కులస్తుల్లో 90 శాతం మంది టీడీపీవైపే ఉన్నారన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చౌడప్ప, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఉపేంద్రతోపాటు టీడీపీ నాయకులు, గాండ్ల పెద్దలు, యువత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యం : టీడీపీ



ఉస్సిగానిపల్లెలో తెలుగుయువత సమావేశంలో యువనేతలు

రామకుప్పం, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యంగా యువత కృషి చేయాలని తెలుగుయువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం కోరారు. ఆదివారం ఐల్ల, ఉస్సిగానిపల్లె, విజలాపురం, కెంచనబల్ల, సింగసముద్రం, మణీంద్రం, గొరివిమాకులపల్లె, కొంగనపల్లె గ్రామాల్లో జరిగిన తెలుగుయువత సమావేశాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన సాకారం కావాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. సమావేశాల్లో తెలుగుయువతనేతలు శంకర్‌చలం, కొళ్లపల్లె విజయ్‌కుమార్, రాజారాం, ప్రభాకర్, జయశీలన్, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, బాలకృష్ణ, బాబాసాహెబ్, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు అనిల్, సతీష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనతో అభివృద్ధి శూన్యం

రామకుప్పం, ఫిబ్రవరి 11: వైసీపీ అరాచకపాలనతో గ్రామసీమలు అభివృద్ధికి దూరమయ్యాయని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి తెలిపారు. ఆదివారం బందార్లపల్లెలో జరిగిన గ్రామ వికాస సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమ ఫలాలు కొందరికే పరిమితం కాగా, అభివృద్ధి మచ్చుకైనా కన్పించడం లేదన్నారు. కుప్పం ప్రజలు కూడా రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు భారీ మెజారిటీతో గెలుపునందించాలని వారు కోరారు. సమావేశంలో నేతలు గంట్లప్ప గౌడు, రామకృష్ణప్ప, నందారెడ్డి, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సుబ్రీ, మునిరెడ్డి, గోవిందప్ప, సుబ్రహ్మణ్యం, ఆనందరెడ్డి, మంజునాథ్, మునిచి. సతీష్, గిరి, సలాం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

ఘనంగా బాటగంగమ్మ జాతర







బైరెడ్డిపల్లెలో విశేషాలంకరణలో బాటగంగమ్మ, గెరిగె ఊరేగింపు, ప్రత్యేక అలంకరణలో పెద్దపులిగంగమ్మ

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11 : పట్టణంలో బాటగంగమ్మ జాతర శని, ఆదివారం ఘనంగా జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి గెరిగె ఊరేగింపు వైభవంగా నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున నడివీధి గంగమ్మ ఆలయం వద్ద కొలువుదీర్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అంబళ్ల నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య గెరిగెను బాటగంగమ్మ ఆలయంవద్ద కొలువుదీర్చి పూజలు జరిపారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం దీపోత్సవం, దీపారాధనలతో అమ్మవారి జల్ది మహోత్సవం జరిగింది. స్థానిక బీసీకాలనీలోని పెద్దపులి గంగమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి.

దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై తెలుగు యువత నేత ఫిర్యాదు



వైసీపీ నేతలపై ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

శాంతిపురం, ఫిబ్రవరి 11 : దుర్భాషలాడి సోషల్ మీడియాలో పెట్టిన వైసీపీ మండల కన్వీనర్ దండపాణి(బుల్లెట్), కడపల్లె పంచాయతీ రెండవ వార్డు మెంబర్ గోవిందప్పలపై రాళ్ళబూదుగూరు పోలీసులకు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కేశవులు ఆదివారం ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం కడపల్లె పంచాయతీ రెండవ వార్డు మెంబర్ గోవిందప్ప కేశవులను దుర్భాషలాడుతూ ఒక వీడియో చేశాడు. ఆ వీడియోను మండల వైసీపీ కన్వీనర్ దండపాణి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ వీడియో చూసి మనస్తాపం చెందిన కేశవులు వారి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ రాళ్ళబూదుగూరు ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ వివరణ కోరగా ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేశారని, పరిశీలించి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు విశ్వనాథ్‌నాయుడు, ఉదయకుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, గోవిందరాజులు, చంద్రశఖర్, ఆర్ఎస్ మణి, జయరామిరెడ్డి, నాగరాజు, చలపతి, పెద్దన్న, గోపాల్, రుద్రప్ప, రాజేంద్ర, మునిరాజు, వెంకటేష్, అనసూయ, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

సారా ఊట ధ్వంసం

సోమల, ఫిబ్రవరి 11: తమ్మినాయనపల్లె పంచాయతీ పేగలవారిపల్లె అటవీ శివారు వాగు వద్ద నాటు సారా తయారీ కేంద్రాల్లో ఎస్ఐ వెంకట నరసింహులు సిబ్బందితో కలసి దాడులు జరిపారు. 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పొలాల వద్ద ఉన్న ఊటను ధ్వంసం చేశారు.

15న సేవాలాల్ మహరాజ్ జయంతి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11: పుంగనూరులో ఈనెల 15న సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించనున్నట్లు బంజారా సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం పుంగనూరు మండలం సుగాలిమిట్టలో ఏడు తాండాలకు చెందిన గిరిజనులు సమావేశమై కమిటీని నియమించుకున్నారు. సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్ మాట్లాడుతూ 15వ తేది ఏడు తాండాల బంజారాలు పూజగానిపల్లి నుంచి పుంగనూరు వరకు ర్యాలీ నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నాగానాయక్, మునేంద్రనాయక్, రమణానాయక్, శ్రీరాములునాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య శిబిరం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11: పుంగనూరు ఆర్టీసీ డిపోలో ఆదివారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. పుంగనూరు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ చరణ్‌కుమార్ తదితరులు ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డిపో మేనేజరు సుధాకరయ్య, డిపో అభివృద్ధి చైర్మన్ జయరామిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నేత

శాంతిపురం, ఫిబ్రవరి 11 : మండల వైసీపీ నాయకుడు అవుల గోపి ఆదివారం నగిరిలో పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అక్రమాలు తప్ప సరైన పరిపాలన లేదన్నారు. షర్మిలమ్మ రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడం ఖాయమని తెలిపారు.

పల్లెకు పోదాం విజయవంతం చేద్దాం

సోమల, ఫిబ్రవరి 11: బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ మదన్ మోహన్‌బాబు అన్నారు. ఆదివారం కందూరు, శీలంవారిపల్లె, అడుసుపల్లె గ్రామాల్లో నాయకులు పర్యటించి ఇంటింటికి పార్టీ క్యాలెండర్లు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శీలం రామూర్తి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలసిన మండల జనసేన నేత

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి11: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను మంగళగిరిలో కలసినట్లు మండల జనసేన అధ్యక్షుడు చైతన్యకుమార్ తెలిపారు. పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ ప్రజలకు తెలియజేయాలని, ప్రజాసమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం చేసినట్లు చైతన్యకుమార్ చెప్పారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

సోమల, ఫిబ్రవరి 11: సోమల మండలంలో సోమవారం నుంచి వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. 7గంటలు మాత్రమే త్రీఫేస్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏ గ్రూప్ ఫీడర్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి 1గంట నుంచి 4గంటల వరకు త్రీఫేస్ సరఫరా ఉంటుందన్నారు. బీ గ్రూప్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, తిరిగి సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు వ్యవసాయానికి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ భరత్ సతీమణి ప్రచారం

రామకుప్పం, ఫిబ్రవరి 11: వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపించాలంటూ ఆయన భార్య దుర్గ ఆదివారం రామకుప్పం పట్టణంలో ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. స్థానిక కోదండరామనగర్ ఇంటింటా మహిళలకు చీరలు పంచుతూ ఆమె ఓట్లు అభ్యర్థించారు. ప్రచారపర్వంలో భాగంగా ఆమె ఓ దుకాణంలో బట్టలను ఇస్త్రీ చేశారు. భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని ఆమె తెలిపారు. ఆమె వెంట జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబు, కోకన్వీనర్ చంద్రారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ లలిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కల్లూరు, ఫిబ్రవరి 11: పులిచెర్ల మండలం కల్లూరు పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పాకాల మండలం దామలచెరువుకు చెందిన మునిరాజ (50), గుండగుట్టపల్లికి చెందిన సుబ్రమణ్యం(52)పీలేరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. కల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద వస్తుండగా తిరువణ్ణామలై నుంచి పీలేరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో వస్తున్న సుబ్రమణ్యం, మునిరాజకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షర్మిలను కలిసిన కుప్పం కాంగ్రెస్ నేత

కుప్పం, ఫిబ్రవరి 11: జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరాజు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను కలిశారు. కుప్పం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని ఆమెను కోరినట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని షర్మిల సూచించినట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మానస క్లినిక్, పున్నమి బేకరి సహకారంతో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు 75 మందికి కంటిపరీక్షలు జరిపి 45మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వైద్యశిబిరానికి వచ్చిన వారందరికీ నిర్వాహకులు భోజనసౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



చౌడేపల్లె, ఫిబ్రవరి 11 : కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దిన వేడుకలను స్థానిక ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం స్థానిక బజారు వీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరీదేవికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, నిర్వహించి, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కందూరు ఆలయంలో హోమాలు



సోమల, ఫిబ్రవరి 11: కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం కందూరు ఆలయంలో హోమాలు నిర్వహించారు. సాయంత్రం దీపారాధన, కన్యకల పూజ నిర్వహించారు. ఉభయదారులుగా దొంతి నాగనరసింహ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మండలి సభ్యులు ఆలయంలో సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు సురేశ్, నాగభూషం, రాజశేఖర్, త్రివేణి, ప్రసూనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



రొంపిచెర్ల, ఫిబ్రవరి11: రొంపిచెర్ల బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో 102 గోత్రాలతో అగ్నిగుండ ప్రవేశం చేసిన సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, హోమం, దీపారాధనలు చేశారు. కార్యక్రమంలో మహిళా సభ్యులతోపాటువంకాయల జితేంద్రకుమార్, ఉదయ్, ప్రకాష్, నగేష్, కిశోర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గంగవరం, ఫిబ్రవరి11 : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 120 టెట్రాప్యాకెట్లు సీజ్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పలమనేరు మండలంలోని మాదిగబండలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో, ఎస్ఐ శివకుమార్, సిబ్బంది ఆ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. మాదిగబండ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం పట్టుబడగా, అతడివద్ద ఉన్న 120 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఆముదాల యువత



పాలసముద్రం, ఫిబ్రవరి 11: మండలంలోని ఆముదాల దళితవాడలో వైసీపీకి చెందిన యువత ఆదివారం పాలసముద్రంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ ఆయన టీడీపీ కండువాలు కప్పారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించడానికి యువత కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆముదాల గ్రామానికి చెందిన మణికుమార్, నవీన్, హరీష్, మధు, లక్ష్మణ్, దిలీప్, శ్రీకాంత్, శివకుమార్, జయరాజ్ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి అరుళ్‌నాదన్, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి శేఖర్ రాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అమర్‌ను కలసిన టీడీపీ నాయకులు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 11: జీడీనెల్లూరు నియోజకవర్గంలోని పెనుమూరు మండలం గొడుగుమానుపల్లెకు ఆదివారం వచ్చిన మాజీ మంత్రి అమరనాథరెడ్డిని వెదురుకుప్పం టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, నేతలు పోటుగారి గంగయ్య, టీఎం రవి, వరప్రసాద్ కలసిన వారిలో ఉన్నారు.

టీడీపీ, జనసేన సంయుక్త అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11: టీడీపీ, జనసేన సంయుక్త అభ్యర్థిని జీడీనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిపించడమే లక్ష్యమని నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, తిరుపతి పరిశీలకులు భీమనేని చిట్టిబాబును వెదురుకుప్పం మండలం దేవళంపేట క్రాస్ రోడ్డు వద్ద పార్టీ నాయకులు కలిసి శాలువలు కప్పి, సన్మానించారు. క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళీ, నాయకులు హాజరయ్యారు.

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కో-ఆర్డినేటరుకు సత్కారం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 11: జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ పాతగుంటలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కార్యనిర్వాహకులు శాలువ కప్పి సత్కరించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు చిట్టెమ్మ, టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ షణ్ముగంరెడ్డి, ఆలయ ధర్మకర్త మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పేట రమేశ్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ యతీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే ప్రజలకు ప్రయోజనం: బీజేపీ



కేంద్ర పథకాల వార్షిక క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రామభద్ర పేర్కొన్నారు. ఆదివారం తోటపాళ్యంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలైన గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం ఆవాస్‌యోజన తదితర పథకాలను ప్రజలకు విజువల్స్ ద్వారా వివరించారు. అనంతరం కేంద్ర పథకాల 2024 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, మెప్మా సిబ్బంది షాహిర, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు ఘన నివాళి



పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 11: మండలంలోని రామాపురంలో ఆదివారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని రాష్ట్ర బీజేపీ నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ వృత్తిలో మచ్చలేని జాతీయవాది అని, గొప్ప పండితుడని కొనియాడారు. నాయకులు దేవరాజ్, సుధీర్‌కుమార్, సురేష్, సునీల్ పాల్గొన్నారు.

జొన్నగురకలలో 'పల్లె పల్లెకు పోదాం'

తవణంపల్లె, ఫిబ్రవరి 11: మండలంలోని జొన్నగురకల, మత్యం తదితర గ్రామాల్లో పల్లె పల్లెకు పోదాం కార్యక్రమాన్ని తవణంపల్లె మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి బాలచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బీజేపీ పూర్తిచేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై
తెలుగు యువత నేత ఫిర్యాదు



వైసీపీ నేతలపై ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

శాంతిపురం, ఫిబ్రవరి 11: దుర్భాషలాడి సోషల్ మీడియాలో పెట్టిన వైసీపీ మండల కన్వీనర్ దండపాణి(బుల్లెట్), కడపల్లె పంచాయతీ రెండవ వార్డు మెంబర్ గోవిందప్పలపై రాళ్ళబూదుగూరు పోలీసులకు మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కేశవులు ఆదివారం ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం కడపల్లె పంచాయతీ రెండవ వార్డు మెంబర్ గోవిందప్ప కేశవులను దుర్భాషలాడుతూ ఒక వీడియో చేశాడు. ఆ వీడియోను మండల వైసీపీ కన్వీనర్ దండపాణి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ వీడియో చూసి మనస్తాపం చెందిన కేశవులు వారి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ రాళ్ళబూదుగూరు ఎస్‌ఐ సుమన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐ వివరణ కోరగా ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేశారని, పరిశీలించి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నాయకులు విశ్వనాథ్‌నాయుడు, ఉదయకుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, గోవిందరాజులు, చంద్రశఖర్, ఆర్‌ఎస్ మణి, జయరామిరెడ్డి, నాగరాజు, చలపతి, పెద్దన్న, గోపాల్, రుద్రప్ప, రాజేంద్ర, మునిరాజు, వెంకటేష్, అనుసూయ, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, ఫిబ్రవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచా మృతాభిషేకాలు, అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

102 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యంతో పట్టుబడిన అశోక్‌ను చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11: అక్రమంగా తరలిస్తున్న 102 మద్యం బాటిళ్లను చిత్తూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేయగా బెంగళూరు నుంచి చీరాల వెళుతున్న అశోక్ (35) అనే వ్యక్తి వద్ద 74 మద్యం బాటిళ్లను గుర్తించిన రైల్వే పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అదే రైలులో మహమ్మద్ ఇలియాస్ (63) అనే వ్యక్తి వద్ద నుంచి 28 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ: ఒకరిపై కేసు నమోదు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 11: మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన హంసవేణిపై అదే గ్రామానికి చెందిన హరియమ్మ, ఆమె కోడలు వెంకటలక్ష్మి దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. తీవ్రంగా గాయపడిన హంసవేణి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. హరియమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణంలో చోరీ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 11: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మార్కెట్ యార్డు సమీపంలో పార్వతమ్మ అనే మహిళ చిల్లరకొట్టు నిర్వహిస్తోంది. ఎప్పటిలాగే శనివారం రాత్రి దుకాణం మూసుకొని ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు పార్వతమ్మకు చెందిన ద్విచక్ర వాహనంతో పాటు దుకాణంలోని రూ.17వేలను చోరీ చేసుకెళ్లినట్లు బాధితురాలు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

చిత్తూరు, ఫిబ్రవరి 11: చిత్తూరు నగరంలో లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గంగాసాగరం వద్ద చంద్రమ్మ అనే మహిళ ఆదివారం తన ఇంటి బయట కూర్చుని ఉన్న సమయంలో వేలూరు వైపు వెళుతున్న ఓ లారీ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై బైండోవర్ కేసు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 11: మండలంలోని వివిధ గ్రామాల్లో రౌడీ, కేడీల జాబితాలో ఉన్న నలుగురి వ్యక్తులను గుర్తించి వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు గంగాధరనెల్లూరు సీఐ శంకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముందస్తుగా ఆత్మకూరు దళితవాడకు చెందిన దక్షిణమూర్తి, వెజ్జుపల్లె దళితవాడకు చెందిన వినోద్‌కుమార్, కుప్పనపల్లె ఆదిఆంధ్రవాడకు చెందిన సిద్ధయ్య, ఎం.నాశంపల్లెకు చెందిన మురళిలను ఆదివారం బైండోవర్ చేసినట్లు తెలిపారు. వారికి ఎన్నికల నిబంధనలతో పాటు ఎన్నికలరోజు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎక్కడా సంచరించరాదని హెచ్చరికలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తుగా ప్రతి పంచాయతీ పరిధిలో రౌడీ, కేడీ పోలీస్ కేసుల్లో ఉన్నవారిని గుర్తించి త్వరలోనే బైండోవర్ చేయనున్నట్లు సీఐ చెప్పారు.

వైసీపీలోనే బలిజలకు న్యాయం

గుడిపాల, ఫిబ్రవరి 11: బలిజలకు వైసీపీ ప్రభుత్వంలోనే సముచిత న్యాయం జరిగిందని మండల వైసీపీ అధ్యక్షుడు జనార్దన్, కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్ రాయల్ అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వంపై బలిజలను అణగదొక్కుతున్నారని చెప్పడం తగదన్నారు. వైసీపీ, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ఎస్‌ఆర్ ప్రసాద్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 11: గిరింపేట దేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌ఆర్ ప్రసాద్‌కు డాక్టరేట్ లభించింది.యూఎస్‌ఏకి చెందిన డే స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్శిటీ ప్రతినిధులు ఆదివారం హైదరాబాదు బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

టీడీపీ నేత మృతికి పలువురి నివాళి

విజయపురం, ఫిబ్రవరి 11: మండలంలోని జంబాడలో టీడీపీ నాయకుడు శంకర్‌రాజు మృతి చెందడంతో ఆదివారం ఆపార్టీ చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చిన్నబాబు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రవిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు సంతాపం తెలిపారు.

రథసప్తమికి ప్రత్యేక ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 11: ఈనెల 16వ తేదీన రథసప్తమి సందర్భంగా మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టీ కె.ఎస్.శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేష్‌రెడ్డి తెలిపారు. 16వ తేదీన శుక్రవారం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనం, 10గంటలకు శేష వాహనం, మధ్యాహ్నం 12 గంటలకు హంస వాహనం, అనంతరం మధ్యాహ్నం 1 నుంచి 2గంటల వరకు ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం, 3గంటలకు అశ్వ వాహనం, సాయంత్రం 4గంటలకు గరుడ వాహనం, రాత్రి 6గంటలకు హనుమంత వాహనం, 7గంటలకు చంద్రప్రభ వాహన సేవ జరుగుతుందని వారు చెప్పారు.

నేడు నగరపాలక స్పందన కార్యక్రమం

చిత్తూరు, ఫిబ్రవరి 11: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు అన్యాయం



జయహో బీసీ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు తీరని అన్యాయం జరిగిందని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద జయహో బీసీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్ మాట్లాడుతూ నాలుగేళ్ల వైకాపా పాలనలో బీసీ సబ్‌ప్లాన్‌ను పక్కన పెట్టి బీసీలకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో బీసీలకు ఆదరణ పథకం ద్వారా సబ్సిడీపై పనిముట్లు అందించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు విదేశీ విద్యను దూరం చేసి యువత భవితను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి అన్యాయం చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.3700 కోట్లతో స్వయం ఉపాధి రుణాలు అందించి సొంతంగా బతికేలా చర్యలు తీసుకున్న ఘనత టీడీపీదేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ, మండల అధ్యక్షులు రమేష్‌బాబు, శివకుమార్‌రెడ్డి, చిత్తూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్నూరు సబ్‌స్టేషన్ - జగన్నాథపురం రోడ్డుకు
మరమ్మతులు చేయించండి



దుస్థితిలో పన్నూరు-జగన్నాథపురం రోడ్డు

విజయపురం, ఫిబ్రవరి 11: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ - జగన్నాథపురం మార్గమధ్యంలో రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సెల్వం డిమాండ్ చేశారు. చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం అధిక లోడ్‌తో టిప్పర్లు తిరుగుతుండటంతో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని ఆయన వాపోయారు. రోడ్డు గుంతల మయం కావడం వలన నీరు నిలబడిపోయి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, హైవే నిర్వాహకులు రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా నేత్ర ప్రదాయిని మహాకుంభాభిషేకం



మహాకుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రులు

నగరి, ఫిబ్రవరి 11: నగరి పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో నేత్రదాతగా పిలువబడే దేశమ్మ దేవాలయ మహాకుంభాభిషేకం కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 5.30 గంటలకు నగరి కొత్తపేట వద్ద గల వినాయకస్వామి ఆలయం నుంచి టీటీడీ వారిచే ఇవ్వబడిన సారెను మంత్రి రోజా ఊరేగింపుగా దేశమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. కుంభాభిషేకంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలకు ఆలయ కమిటీతో బాటు మంత్రి స్వాగతం పలికారు. వేదపండితులు రామకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గర్భాలయ విమానశిఖర కలశ స్థాపన చేశారు. శిఖర కలశానికి మంత్రులు వేదపండితులతో కలిసి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో మహాకుంభాభిషేక కార్యక్రమం ముగిసింది.

కాణిపాకం ఆలయ పట్టువస్త్రాల సమర్పణ

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11: నగరిలో వెలసిన దేశమ్మ ఆలయానికి కాణిపాకం ఆలయం తరపున ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు కొట్టు సత్యనారాయణ, ఆర్కే. రోజా, వరసిద్ధుడి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి కలసి పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా తీసుకొచ్చి దేశమ్మ ఆలయాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాక ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, దేశమ్మ ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ 1డిపో ఉద్యోగులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11: ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆదివారం నగరంలో ఆర్టీసీ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేది ఎంత ముఖ్యమో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కూడా అంతే ముఖ్యమన్నారు. నిబంధనలు సక్రమంగా పాటిస్తే నగం రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వన్ డిపో సూపరింటెండెంట్లు శివప్రసాద్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాన్పులో మూడు లేగ దూడలు




చౌడేపల్లె, ఫిబ్రవరి 11 : ఒకే కాన్పులో 3 లేగ దూడలు పుట్టిన ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం అర్థరాత్రి జరిగింది. పరికిదొనకు చెందిన రత్నయ్య పాడి ఆవులు మేపుకొంటూ జీవనం సాగించేవాడు. శనివారం అర్ధరాత్రి ఆవుకు ప్రసవ సమయం రావటంతో గడ్డంవారిపల్లె పశువైద్యశికిత్స శిబిరంలో ఉన్న అటెండర్ రామకృష్ణకు సమాచారం అందించారు. ఆయన పరికదొనకు వెళ్లి ఆవుకు కాన్పు చేశాడు. ఈకాన్పులో 2 పెయ్యదూడలు, ఒక కోడె దూడకు ఆవు జన్మనిచ్చింది. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

గంగవరం, ఫిబ్రవరి11 : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 120 టెట్రాప్యాకెట్లు సీజ్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పలమనేరు మండలంలోని మాదిగబండలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో, ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది ఆ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. మాదిగబండ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం పట్టుబడగా, అతడివద్ద ఉన్న 120 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు



వాలీబాల్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11: బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ రెడ్డెప్ప, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి బహుమతులందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన మైనూరు జట్టుకు రూ.50వేలు నగదు, ద్వితీయ బహుమతి మైలారుదొడ్డి జట్టుకు రూ. 30వేలు, తృతీయ బహుమతి పొందిన సిద్ధగట్ల జట్టుకు రూ.20వేలు, నాలుగో బహుమతి వి.కోట జట్టుకు రూ. 10వేలు నగదు బహుమతిని అందజేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, గంగవరం సీఐ కృష్ణమోహన్ కొంతసేపు వాలీబాల్ పోటీలను తిలకించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీహరిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, ఇర్షాద్, విశ్వమోహన్, రవికుమార్, ప్రసాద్, జిలాని, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

'జయహో బీసీ'ని విజయవంతం చేయాలి: భీమనేని

పాలసముద్రం, ఫిబ్రవరి 11: పాలసముద్రం మండలంలో ఈనెల 16వ తేదీన జరిగే జయహో బీసీ సమావేశాన్ని విజయవంతం చేయడానికి టీడీపీ నాయకులు కృషిచేయాలని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో నాయకులతో సన్నాహ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి మండలంలో వున్న బీసీ నాయకులంతా అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు దాము రెడ్డి, మోహన్ రెడ్డి, జె. విజయ్‌కుమార్, రాఘవన్, బుజ్జి నాయుడు, వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసమే జనసేనలో చేరా: డీకే చైతన్య



మాట్లాడుతున్న డీకే చైతన్య

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 11: ప్రజాసేవ కోసమే జనసేన పార్టీలో చేరానని ఆ పార్టీ నాయకురాలు డీకే చైతన్య చెప్పారు. ఆదివారం నగరంలోని ఇరువారంలో ఉన్న బాలాత్రిపుర సుందరి ఆలయం నుంచి జన సైనికులు దర్గాసర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, పాతబస్టాండు, గాంధీ విగ్రహం, కొత్తబస్టాండు మీదుగా లక్ష్మీనగర్ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా భావాన్ని చూసి పార్టీకి ఆకర్షితురాలినయ్యానని చెప్పారు. నగరంలోని తేనెబండ, మార్కెట్ చౌక్, గుడిపాల, చిత్తూరు రూరల్ తదితర ప్రాంతాల నుంచి వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో నేతలు యశ్వంత్, దయారాం, చందు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పూతలపట్టు, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో ఆదివారం ఎర్రచెరువుపల్లి గ్రామానికి చెందిన రెడ్డెప్ప నాయుడు, శోభల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు భోజనం వితరణ చేశారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నేత యువరాజు నాయుడు, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, దామోదర్ నాయుడు, గాంధీ, చిట్టెమ్మ, వెంకటరమణారెడ్డి, ఏకాంబరం, వీరభద్రయ్య, చౌదరి, భాస్కర్, మురళి, సోము, శ్రావణ్ కుమార్, విజయ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



పాఠశాలలో పూజలు చేస్తున్న గ్రామస్థులు

పాలసముద్రం, ఫిబ్రవరి 11: మండలంలోని ఎస్.ఆర్.కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని స్థాపించడానికి ఆదివారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు భూమిపూజ చేశారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. సర్పంచ్ మహేష్ నాయుడు, ఎస్టీయూ నాయకులు ఏయుమలై, గ్రామస్థులు పాల్గొన్నారు.

షర్మిల సభకు తరలివెళ్లిన కార్యకర్తలు

కార్వేటినగరం, ఫిబ్రవరి 11: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నగరిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు కార్వేటినగరం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పీసీసీ మీడియా కో-ఆర్డినేటర్ గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దినకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బహిరంగసభకు తరలివెళ్లారు.

అలరించిన ఘంటసాల పాటల కచేరి

కార్వేటినగరం, ఫిబ్రవరి 11: కార్వేటినగరం తూర్పు వీధి వినాయక స్వామి ఆలయం వద్ద ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన పాటల కచేరి ప్రజలను అలరించింది. సినీ రంగానికి ఘంటసాల చేసిన సేవలను స్థానికులు స్మరించుకున్నారు. వందలాది మంది ఘంటసాల అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సారా ఊట ధ్వంసం

సోమల, ఫిబ్రవరి 11: తమ్మినాయనపల్లె పంచాయతీ పేగలవారిపల్లె అటవీ శివారు వాగు వద్ద నాటు సారా తయారీ కేంద్రాల్లో ఎస్‌ఐ వెంకట నరసింహులు సిబ్బందితో కలసి దాడులు జరిపారు. 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పొలాల వద్ద ఉన్న ఊటను ధ్వంసం చేశారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

గుడిపాల, ఫిబ్రవరి 11: బస్ షెల్టర్ లేక రోగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చిత్తూరు - వేలూరు, వేలూరు - చిత్తూరు జాతీయ రహదారిలోని 190 రామాపురం సీఎంసీ వద్ద మారుమూల ప్రాంతాల నుంచి తమ జబ్బులను నయం చేసుకోవాలని ఆస్పత్రికి వచ్చిన రోగులు తిరిగి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఎండకాసినా, వాన కురిసినా వాహనాల రద్దీ మధ్య బస్సులకోసం ఇక్కడ వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని, తాత్కాలిక బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్ షెల్టర్ లేక పోవడంతో సీఎంసీ వద్ద రోగుల అగచాట్లు